

# పలాయితుడు

అపశయ్యా నవీన

''ఊర్మిళా... ఊర్మిళా...'' గావుకేకలు పెడుతూ ఇంట్లోకి ప్రవేశించాడు అర్జున్‌రావు.

''వస్తున్నానండీ!'' అంటూ చేతిలో ఉన్న పనిని వదిలేసి వంటగది లోంచి పరిగెత్తుతున్నట్లుగా హాల్లో కొచ్చింది ఊర్మిళ.

''ఏమైందండీ! ఎందుకంత బిగ్గరగా పిలిచారు'' అంది ఊర్మిళ, కంగారుగా అటూ ఇటూ తిరుగుతున్న భర్తను చూసి.

''ఏమైందా? కొంప మునిగింది'' అన్నాడు అర్జున్‌రావు పళ్ళు కొరుకుతూ.

''కొంప మునిగేంత ప్రమాదం ఇప్పుడు ఏం ముంచుకొచ్చిందో...?'' అంది ఊర్మిళ.

''అంతా నీవల్లే జరిగింది. నీకసలు బుద్ధిలేదు'' అన్నాడు అర్జున్‌రావు.

''తర్వాత తిడుదురుగానీ ముందు అసలేం జరిగిందో చెప్పండి'' అంది ఊర్మిళ.

''ఆ ఉజ్వల చిట్‌ఫండ్ వాడికి నెలనెలా చిట్టీ కడ్తున్నామా... ఇన్‌స్టాల్‌మెంట్సన్నీ అయిపోయే దశలో తీసుకుంటే ఎక్కువ లాభమని మనం ఇంత వరకు ఒక్క పైసా కూడా తీసుకోవద్దన్నావు కదా. వాడికి అరవై వేల వరకు చెల్లించాం. ఇప్పుడా చిట్టీలు నడుపుతున్న మోహన్ రావుగాడు మనలాంటి ఎందరి నెత్తుల మీదనో టోపీ పెట్టేసి ఈ ఊర్నించి నిన్ననో, మొన్ననో ఉడాయించేశాట్ట. మనలాగే వాడికి చిట్టీలు కట్టిన జనమంతా తాళం వేసి ఉన్న వాడింటి ముందుకెళ్ళి లబోదిబోమని మొత్తుకుంటున్నారు. అంతా కర్మ... కర్మ...'' అంటూ తలబాదుకున్నాడు అర్జున్‌రావు.

''అయ్యో! అంతపని జరిగిందా?... ఆ మోహన్ రావు అంతపని చేశాడా?... వాడు ఎంతో వినయంగా, ఎంతో మంచివాడిలా కనిపించేవాడు. వాడింత పని చేశాడంటే నమ్మలేకపోతున్నానండీ'' అంది ఊర్మిళ.

''నమ్మకపోతే దేంట్లోనన్నా పడి చావు... అంతా నీ వల్లే. వాడు చాలా మంచివాడండి... వాడు చాలా కాలం నుండి చిట్టీలు నడుపుతున్నాడు... మా అక్కా బావలు అతడికి చిట్టీలు కట్టి ఒకేసారి రెండు లక్షలు తీసుకొని చక్కగా కారు కొనుక్కున్నారు....

మనమూ అలాగే చేద్దామని నువ్వు నా చెవిలో గూడు కట్టుకొని చెప్పడం వల్లనే నేను వాడిని నమ్మాను. తలుచుకుంటే గుండెలు తరుక్కుపోతున్నాయి. నీ మాటలు నమ్మి లక్ష రూపాయలు పోగొట్టుకున్నాను. అంతా నీవల్లే. నిన్ను చంపినా పాపం లేదనిపిస్తోంది'' అతడు మళ్ళీ పళ్ళు కొరికాడు.

''నన్ను చంపాలని మీకంతగా కోరికుంటే చంపండి... వాడెవడో మోసం చేస్తే నామీద మండిపడ్తున్నారేమిటి?''

''వాడు మంచివాడు, నమ్మకస్తుడు... మోసం చేసేరకం కాదని మీ బావగారు చెప్పారని నువ్వు నాకెన్నిసార్లు చెప్పావో గుర్తుందా? నువ్వు చెప్పబట్టే నేను వాణ్ణి నమ్మాను''

''నాకన్నా ముందే, మీరే అతన్ని గురించి ఎన్నోసార్లు చెప్పారని మరచిపోతున్నారు. రాంబాబు అనే మీ ఫ్రెండొకాయన మోహనరావు దగ్గర చిట్టీలు కట్టి చాలా లాభపడ్డాడని, ఒకేసారి చిట్టీ ఎత్తుకొని వాళ్ళమ్మాయి పెళ్ళి చేశాడని, మనం కూడా మోహనరావు దగ్గర చిట్టీ కట్టి మీ అక్కా, బావల్లాగ ఓ కారు కొనుక్కుంటే ఎలా ఉంటుందని మీరడిగినప్పుడు అతడు నమ్మకస్తుడేనని నేనూ విన్నానని చెప్పాను. అసలు మోహనరావు ప్రస్తావన మొట్టమొదలు తెచ్చింది మీరే.... ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటని అడిగినప్పుడే నేను నా అభిప్రాయం చెప్పాను. అతడిలా చేస్తాడని నేనుమాత్రం ఊహించానా?''

''అవును... నీ అభిప్రాయం అడిగాను. నీకు నువ్వు చాలా తెలివైనదాన్నని, నేనేమో చాలా తెలివితక్కువ వాడినని, డబ్బులు వృథా చేస్తానని అనుకుంటావు కదా. నువ్వు చాలా ప్రాక్టికల్. ముందు చూపు ఉన్నదానివి అనుకొని నీ సలహా అడిగాను. ఈ చిట్టీలు నడిపేవాళ్ళను నమ్మొద్దండీ.. అని నువ్వు చెబుతావనుకున్నాను. నువ్వేమో మీ అక్కా, బావల మాటలు నమ్మి వాడు నమ్మకస్తుడండీ అని చిలుకపలుకులు పలికావు. మీ అక్కాబావలంటే నీకు దేవతలు కదా...''

''అవును చెప్పాను. అతన్ని గురించి అప్పుడందరూ అలాగే అనుకున్నారు. చిట్టీ కట్టడం మంచిదే కదా... కంపల్సరీ సేవింగ్ అవుతుంది. చేతిలో డబ్బుంటే ఎన్నో వృథా ఖర్చులవుతాయి. చిన్న చిన్న ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో డబ్బు కడ్తే ఒకేసారి పెద్ద మొత్తంలో చేతికొస్తుంది. ఏదన్నా మంచి అవసరానికి పనికొస్తుంది అనుకున్నాను. ఇప్పుడు నన్నంటున్నారు గానీ, మీరు మాత్రం అతడు మంచివాడేనని అనుకోలేదా? ఓ కారు కొనుక్కోవాలన్నది మీ కల. దాన్ని నిజం చేసుకుందామనే మీరు మోహనరావు నడుపుతున్న- లక్ష రూపాయల చిట్టీని తీసుకున్నారు. అంతా మీరే నిర్ణయించుకొని ఏదో మాటవరసకు నా సలహా అడిగినట్టు అడిగి, ఇప్పుడు తప్పంతా నాదేనని నన్నంటున్నారు''

''నిన్నే అంటాను... ముమ్మాటికి నిన్నే అంటాను. అతడు నమ్మకస్తుడని నువ్వు అంతగా చెప్పకపోతే నేనతని జోలికే వెళ్ళేవాడిని కాదు. అంతా నీ కారణంగానే జరిగింది. కేవలం నీ అక్కా బావల మాటలు నమ్మి నువ్వు నన్ను ముంచేశావు. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. నాకా లక్షరూపాయలు నువ్వే తెచ్చివ్వాలి''

''ఇది మరీ బావుంది. లక్ష రూపాయలు నేనెక్కడ్నించి తెచ్చేది''

''మీ అక్కాబావలు వాడు చాలా నమ్మకస్తుడని చెప్పారుగా... వాళ్ళనడిగి తీసుకురా.''

నీ మాటలు వింటూంటే నవ్వాలో ఏడ్వాలో తెలీటంలేదు''

వాళ్ళిద్దరలా మాట్లాడుకుంటుండగానే బయట్నించి

''మీరిద్దరేదో గొడవ పడ్తున్నట్లున్నారు. ఏమైంది?'' అంటూ అర్జున్‌రావు మిత్రుడు, సుధీర్ రెడ్డి వాళ్ళింటి కొచ్చాడు.

''కొంప మునిగిందిరా సుధీర్! ఆ చిట్టీ నడిపే మోహనరావు గాడు అందరి నెత్తులమీదా కుచ్చుటోపీలు పెట్టేసి ఓ ఇరవై లక్షలు జమ చేసుకుని ఈ ఊర్లోంచి బిచాణా ఎత్తేశాడు'' అన్నాడు అర్జున్‌రావు.

''మీ నెత్తిమీద ఎంత పడిందేమిటి?'' అన్నాడు సుధీర్‌రెడ్డి.

''ఓ లక్ష. ఈవిడగారే వాడు చాలా నమ్మకస్తుడని, మన డబ్బెక్కడికీ పోదని వాడికి సర్టిఫికెటిచ్చి నాచేత చిట్టీ కట్టించింది. ఈమె మాట వినే నేను ఇంత ఘోరంగా మోసపోయాను'' అన్నాడు అర్జున్‌రావు.

''ఊర్మిళ అలా చెప్పిందే అనుకో... నీ తెలివెక్కడబోయిందిరా అర్జున్! రిజిష్టర్డ్ సంస్థలు కాకుండా ఇలా వ్యక్తులు నడిపే చిట్టీల బిజినెస్‌ను నమ్మకూడదని, ఊర్మిళకు కాదు, నీకు తెలియాలి. రిజిష్టర్డ్ అయిన సంస్థలకయితే కొంత సెక్యూరిటీ ఉంటుంది. వ్యక్తులు నడిపే ఇలాంటి చిట్టీలకు ఎలాంటి సెక్యూరిటీ ఉండదు. ఈ విషయం బయటి ప్రపంచంలో తిరుగుతున్న నీకు, నాకూ తెలియాలిగాని, పాపం ఊర్మిళకెలా తెలుస్తుందిరా పూల్!'' అన్నాడు సుధీర్.

''అలా అడగండన్నయ్యా! ఎక్కడ ఏ పొరపాటు జరిగినా ఈయనగారొచ్చి నామీదకు ఒంటికాలుమీద లేస్తుంటాడు'' అంది ఊర్మిళ.

''ఈయనే కాదు. చాలామంది వీడిలాగే మనం చేసే పనులవల్ల ఏదన్నా చెడు జరిగితే, అందుకు బాధ్యులం మనం కాదని, వేరెవర్నో అందుకు బాధ్యులను చేసే ప్రయత్నం చేస్తారు. వీడిది అలాంటి మనస్తత్వమే'' అన్నాడు సుధీర్.

''నువ్వేమైనా చెప్పరా... ఈవిడగారి మాట నమ్మే నేను మోహనరావుగాడి దగ్గర చిట్టీ కట్టాను'' అన్నాడు అర్జున్‌రావు.

''నోర్ముయ్యరా అర్జున్... నువ్వు పొరపాటు చేసి ఆమెనెందుకంటావు? అయ్యిందేదో అయ్యింది. ఇకనుండైనా జాగ్రత్తగా ఉండండి. అది సరే, టైమయ్యిందిరా అర్జున్ మనం బయల్దేరాలి'' అన్నాడు సుధీర్ అర్జునరావు కేసి చూస్తూ.



## ముద్దుగుమ్మల మధ్య పోరు...

టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఇప్పుడు అనుష్క, ఇలియానాల హవా సాగుతోంది. ముఖ్యంగా కోలీవుడ్‌లో కాజల్, సమంత, తమన్నా, తాప్సీలను పక్కన పెట్టి అనుష్క, ఇలియానాలు దూసుకుపోతున్నారు. ఇద్దరి చేతిలో చెరో ఆరేడు చిత్రాలు ఉన్నాయట! ఎవరి చిత్రాలు వాళ్ళు చేసుకుంటూ పోతే అసలు గొడవే ఉండేది కాదు. చిక్కంతా ఇక్కడే ఉంది. అనుష్క అవకాశాలు కొన్ని ఇలియానా చేజిక్కించుకుంటోంది. కోలీవుడ్‌లో కొంత మంది హీరోల పక్కన అనుష్క పెద్దగా కనిపిస్తుండడంతో ఆమె స్థానంలో ఇలియానాను తీసుకుంటున్నారట! దాంతో అనుష్క ఇలియానా మీద కారాలూ మిరియాలు నూరుతోంది. వీరిద్దరి గొడవతో పడలేని కొందరు దర్శక నిర్మాతలు ఇద్దరినీ వద్దనుకుంటున్నారట!

సుధీర్ రెడ్డి, అర్జున్‌రావు ఒకే గవర్నమెంట్ స్కూళ్ళో టీచర్స్‌గా పనిచేస్తున్నారు. ఆ స్కూలు వరంగల్‌కు పదిహేను కిలోమీటర్ల దూరంలో వుంటుంది. వాళ్ళిద్దరూ కలిసి రోజూ సుధీర్ మోటారు సైకిల్‌మీదే ఆ స్కూలుకు వెళ్తొస్తుంటారు.

''నేను జాగ్రత్తగా ఉంటే సరిపోతుందా? ఈవిడగారు నన్ను జాగ్రత్తగా ఉండనిస్తుందా? ఇలాంటిదేదో తెచ్చిపెడ్తూనే ఉంటుంది'' అన్నాడు అర్జున్‌రావు ఊర్మిళకేసి ఆమెను తినేసేలా చూస్తూ. ఇంత అందమైన భార్యతో వీడింత క్రూరంగా ప్రవర్తించటం ఘోరం!'' అనుకున్నాడు సుధీర్.

''నేనేం తెచ్చిపెట్టను. అన్నీ మీరే తెచ్చుకుంటారు'' అంది ఊర్మిళ.

''మీరు తీరికగా వాదించుకుందురుగానీ అవతల స్కూలుకు టైమైపోతోంది... నువ్వు వస్తావా?

నన్ను వెళ్ళిపొమ్మంటావా?'' అన్నాడు సుధీర్.

''నేనూ వస్తారా... రెడీగానే ఉన్నాను'' అన్నాడు బయటికెళ్ళి పోర్టికో కింద ఉన్న షూజ్ వేసుకుంటూ.

''లంచ్ బాక్స్ రెడీ చేస్తాను. ఒక్క క్షణం ఆగండి'' అంటున్న ఊర్మిళ మాట విని.

''ఇంకేం లంచ్‌బాక్సు... అక్కర్లేదు. నువ్వు ఆ మోహనరావు గాడితో పెట్టించిన లంచ్‌తో కడుపు నిండిపోయింది'' అంటూ సుధీర్ స్టార్ట్ చేసిన మోటార్ సైకిల్ వెనకసీట్లో కూర్చున్నాడు అర్జున్ రావు. మరుక్షణంలో వాళ్ళిద్దరూ అక్కడ్నించి వెళ్ళిపోయారు.

''ప్రతి దానికి నన్ను నిందించటం ఇతడెప్పుడు మానుకుంటాడో!'' అనుకుంటూ కళ్ళనీళ్ళతో ఊర్మిళ ఇంట్లోకెళ్ళిపోయింది.

***

ఇది జరిగిన నెలరోజుల తర్వాత ఒక రోజు అర్జున్‌రావు స్కూలునుండి వస్తూనే ''ఊర్మిళా... ఊర్మిళా...'' అని కేకేసి ఆమె ''యేమిటండీ!'' అంటూ రాగానే

''కొంప మునిగింది'' అన్నాడు.

''మళ్ళీ ఏమైందండీ!'' అంది ఊర్మిళ.

''ఈ రోజు మా స్కూలు హెడ్‌మాస్టర్ లీవ్ పెట్టాడు. మా సుధీరే ఇన్‌ఛార్జి. ఊర్లో బోనాల పండగ జరుగుతోందని స్కూలుకు పిల్లలెవరూ రాలేదు. ఊరికే కూర్చుంటే బోర్ కొడ్తోందని కాస్సేపు కార్డ్సు ఆడుకుందామన్నాడు సుధీర్. ''వద్దురా... మనం స్కూల్లో కార్డ్సు ఆడటం ఊరివాళ్ళెవరైనా చూస్తే బావుండదు. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు పేకాటలో మునిగి తేలుతున్నారని మీడియా అంతా ప్రచారమైపోతుంది'' అన్నాను. అయినా సుధీర్ నా మాట విన్లేదు. ''ఏం కాదులేరా! ఇలా లీజర్ దొరికినప్పుడల్లా ఇది వరకెప్పుడూ మనం కార్డ్సు ఆడనట్లు మాట్లాడుతున్నావు'' అంటూ మా స్కూళ్ళో పనిచేస్తున్న ఆరుగురు టీచర్లను హెడ్‌మాస్టర్ రూంలోకే రమ్మన్నాడు. అందరం వెళ్ళి డబ్బులు పెట్టి చిన్న స్టేకే అనుకో... పేకాడటం మొదలెట్టాం. ఉదయం తొమ్మిదన్నరకు మొదలెట్టి లంచ్ టైమ్ వరకు అందరం పేకాటలో మునిగిపోయి బయటి పరిసరాలను పూర్తిగా మరచిపోయాం. ఏడో తరగతి చదువుతున్న కొందరు మా విద్యార్థులు మేం పేకాడటం చూశారు. మెల్లగా వెళ్ళి ఆ ఊర్లో ఉన్న ఓ టీవీ ఛానెల్ రిపోర్టర్‌కు చెప్పేశారు. ఆ రిపోర్టర్ వచ్చి మేం పేకాడుతున్న దృశ్యాల్ని వాడి కెమెరాలోకి దించేశాడు. కొంప మునిగిందనుకో. ఉద్యోగం ఊడే పరిస్థితి ఏర్పడింది. అంతా వాడే చేశాడు. ఆ సుధీర్‌గాడి కారణంగానే ఇదంతా జరిగింది... వాడో మూర్ఖుడు. ఎంత చెప్పినా విన్లేదు. వాడి కారణంగా మనకు వీధుల్లో అడుక్కుతినే పరిస్థితి ఏర్పడింది'' అన్నాడు అర్జున్‌రావు రెండు చేతుల్తో తల పట్టుకొని.

''సుధీర్‌గాడే చేశాడని ఇప్పుడు గొంతు చించుకుంటే ఏం లాభం. అతడు ఆడదామంటే మాత్రం మీ బుద్ధెక్కడకి పోయింది? స్కూళ్ళో పేకాడటం తప్పని మీరు గట్టిగా నిలబడితే అతడేం చేసేవాడు'' అంది ఊర్మిళ.

''ఈ రోజు వాడే హెడ్‌మాస్టర్... హెడ్‌మాస్టర్ మాట వినకపోతే అదో సమస్య. రోజూ వాడు తన బండిమీద స్కూలుకు తీసుకెళ్తున్నాడు కదా! అదో మొహమాటం. వాడి మాట కాదని ఎలా అనాలి... అంతా కర్మ''

''నేనెన్నోసార్లు చెప్పాను. మనం ఎవరిమీదా ఆధారపడొద్దని. మీ స్కూలుకు ఈ ఊరినుండి బోల్డు ఆటోలు నడుస్తున్నాయి ఆటోలో వెళ్ళండని. లేకపోతే మీరే ఓ మోటారు సైకిల్ కొనుక్కోండి, బ్యాంకుల వాళ్ళు చాలా ఈజీగా లోన్స్ ఇస్తున్నారని కూడా చెప్పాను. నా మాట విన్నారా?''

''మహా చెప్పావులే. వాడు నాకు చిన్నప్పట్నించి ఫ్రెండ్. వాడింత పనిచేస్తాడని, నన్నింత అప్రతిష్ఠ పాలు చేస్తాడని కలలో కూడా ఊహించలేదు''

''ఇప్పుడేమవుతుందంటారు. నిజంగానే మీ ఉద్యోగం పోతుందంటారా?'' అంది ఊర్మిళ.

''ఆ టీవీ ఛానెల్ వాడొచ్చి మా పేకాటను వీడియో తీశాడని తెలియగానే మేం వెళ్ళి అతడ్ని దీన్ని బయటపెట్టొద్దని బతిమిలాడాం. అతన్ని మా స్కూలుకు తీసుకొచ్చిన మా విద్యార్థుల్ని కూడా



అతడి దగ్గరికి తీసుకెళ్ళాం. మా విద్యార్థులు కూడా "ఈ ఒక్కసారికి మా సార్లను వదిలేయండి" అని చెప్పారు. అతడు సరే అన్నాడు. ఇలా జరిగిందని ఆ ఊరి విద్యాకమిటీ వారికెక్కడా తెలిసిపోయింది. వాళ్ళ దగ్గరకెళ్ళి మరోసారి ఇలా జరగదని, మొదటి తప్పు కాబట్టి క్షమించండని అడిగాం. టీచర్‌గా నాకు మంచి పేరే ఉంది. అర్జున్‌రావును చూసి మిమ్మల్ని వదిలేస్తున్నామని అన్నారు వాళ్ళు. రేపు వెళ్ళి మామీద ఎలాంటి యాక్షన్ తీసుకోవద్దని మా హెడ్‌మాస్టర్ కాళ్ళు కూడా పట్టుకోవాలి"

"ఇంత జరిగినా సుధీర్‌గాడికి మాత్రం చీమ కుట్టినట్టయినా లేదు. "ఇంత మాత్రానికే ఉద్యోగం ఊడుతుందని భయపడ్తున్నారా? మీరొట్టి పిరికిపందలు. ఏం జరగదు. అంతా నాకొదిలేయండి. ఐవిల్ మానేజ్ ఎవ్రీథింగ్..." అన్నాడు. వాడో రాస్కెల్... వాడో స్కౌండ్రెల్. టీచర్‌గా ఎంతో మంచి పేరున్న నన్ను అప్రతిష్టపాలు చేశాడు. ఉద్యోగం పోకపోవచ్చు గానీ, ఇంత జరిగాక నాకే ఆ ఊర్లో తలెత్తుకొని తిరగాలనిపించటం లేదు. ఎలాగైనా ఉ ఊర్నించి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి. ఆ సుధీర్‌గాడికి చాలా దూరంగా ఉండాలి" అన్నాడు అర్జున్‌రావు.

"మన బుద్ధి చక్కగా ఉంటే ఎంతమంది సుధీర్లయినా మనల్నేం చేయలేరు" అంది ఊర్మిళ.

"మహ చెబుతున్నావులే! నువ్వు మాత్రం అతనితో ఫ్రెండ్‌షిప్ వద్దని ఎప్పుడైనా చెప్పావా? అన్నయ్యా! అన్నయ్యా! అంటూ అతడు కనిపించగానే గారాలకు పోయేదానివి. ఇందులో నీ బాధ్యత కూడా ఉంది" అన్నాడు అర్జున్‌రావు.

"ఔనౌను. మీకేది జరిగినా, మీరేం చేసినా నేనే బాధ్యురాలిని" అంది ఊర్మిళ.

***

మరో ఆరు నెలలు గడిచాయి. కొత్త స్కేళ్ళు అమల్లోకి రావడం వల్ల టీచర్ల జీతాలు గణనీయంగా పెరిగాయి. పెద్ద మొత్తాల్లో ఎరియర్స్ కూడా వచ్చాయి. అంత డబ్బును ఏం చేద్దామని అర్జున్‌రావు ఆలోచిస్తున్న టైమ్‌లోనే "ఇప్పుడు షేర్‌మార్కెట్ మంచి ఊపులో ఉంది. ఏదైనా ఓ మంచి కంపెనీవారి పది వేల షేర్లు కొని పడేశావనుకో.... ఆరు నెలల్లో నువ్వు కోటీశ్వరుడివి అయిపోవచ్చు" అంటూ వచ్చాడు కృపాకర్‌రావు. అర్జున్‌రావుకు పెద్దమొత్తం ఎరియర్స్‌గా వచ్చాయని తెలిసిన కృపాకర్‌రావు అర్జున్‌రా వింటికే వచ్చి ఈ మాట చెప్పాడు.

కృపాకర్‌రావుకు షేర్‌మార్కెట్‌ను గురించి బాగా తెలుసునని అందరూ అనుకుంటారు. షేర్స్ విషయంలో సలహాలివ్వటానికి అతడో కన్సల్‌టెన్సీ సంస్థను కూడా నడుపుతున్నాడు. కృపాకర్‌రావుకు అర్జున్‌రావుతో బంధుత్వం కూడా ఉంది. అర్జున్‌రావుకు కృపాకర్‌రావు చిన్నాయన వరసవుతాడు. షేర్స్ బిజినెస్‌లో బాగా సంపాదించాడని కృపాకర్‌రావును అతని బంధువర్గమంతా చాలా గొప్పవాడిగా అతన్ని ఎంతో గౌరవిస్తారు. ఇదివరక్కూడా కృపాకర్‌రావు అర్జున్‌రావుతో "ఫలానా కంపెనీ కొత్తగా షేర్లను ప్రకటించింది. వాటిని కొంటే చాలా లాభాలొస్తాయ"ని చెప్పాడు. కృపాకర్‌రావుతో ఊర్మిళక్కూడా చాలా చనువుంది. "నువ్వూ మా అమ్మాయివేనమ్మా. నాకు మా అమ్మాయి సునీతెంతో నువ్వూ అంతేనమ్మా! మీరు ఆర్థికంగా ఎంతో పైకి రావాలనే నేను కోరుకుంటున్నాను. మీ స్కేల్స్ రివైజయి మీకు పెద్దమొత్తంలో ఎరియర్సొచ్చాయని తెలిసింది. ఆ డబ్బును సరిగ్గా ఇన్‌వెస్ట్ చేస్తే మీరు కోటీశ్వరులైపోతారు" అన్నాడు కృపాకర్‌రావు.

"ఈ డబ్బుని ఎలా ఇన్‌వెస్ట్ చేస్తే బావుంటుందో మీరే చెప్పండి" అన్నాడు అర్జున్‌రావు.

"ఇప్పుడు షేర్‌మార్కెట్ ఫుల్‌స్వింగ్‌లో ఉంది. షేర్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కొత్తగా ప్రారంభమైన ఓ కంపెనీలో ఫ్లోట్ చేసిన షేర్ల ధర ప్రస్తుతం ఈచ్ షేర్ పదిరూపాయలు. ఈ కంపెనీవి ఓ 10 వేల షేర్లు కొన్నారంటే సంవత్సరం తిరిగేలోగా ఒక్కొక్క షేర్ ధర పదివేలవుతుంది. అప్పుడు మీరీ షేర్లు అమ్ముకున్నారంటే మీరు కలలో కూడా ఊహించనంత డబ్బు మీ చేతికొస్తుంది" అన్నాడు కృపాకర్‌రావు.

"ఈ షేర్ల వ్యాపారంలో చాలా రిస్కుందంటారు. అందుకే మేమీ డబ్బును యే బ్యాంకులో నన్నా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేద్దామనుకుంటున్నాము" అన్నాడు అర్జున్‌రావు.

"ఫిక్స్‌డ్ చేస్తే ఏమొస్తుందోయ్... పీనట్స్... బ్యాంకులు వడ్డీరేట్లను బాగా తగ్గించాయి కదా... నా మాట విని నేను చెబుతున్న ఈ కొత్త కంపెనీల షేర్లు కొనండి. సంవత్సరంలోగా కోటీశ్వరులైపోతారు. ఈ అద్దెకొంపల్లో ఉండే బదులు మీరే స్వతంగా ఓ మంచి ఇల్లు కట్టుకోవడమో, అపార్ట్‌మెంట్ కొనుక్కోవడమో చెయ్యొచ్చు. మీ పిల్లల్ని ఓ రెప్యూటెడ్ కార్పోరేట్ రెసిడెన్షియల్ స్కూళ్ళో చదివించుకోవచ్చు" అన్నాడు కృపాకర్‌రావు.

"నాకు షేర్‌మార్కెట్ల గురించి ఏమీ తెలీదు. షేర్లను ఎప్పుడు కొనాలి, ఎప్పుడమ్మాలి, ఇవేవీ నాకు తెలీవు... ఫిక్స్‌డ్ చెయ్యడమే బెటరనిపిస్తుంది బాబాయ్" అన్నాడు అర్జున్‌రావు.

"అన్నిటికీ నేనున్నాను కదా... నా స్వంత కొడుకు, కోడళ్ళలాంటి మిమ్మల్ని నేను మోసగిస్తానా? షేర్‌మార్కెట్ మంచి బూమ్‌లో ఉంది. ఇది ఇలాగే చాలాకాలం కొనసాగుతుందని అందరూ అనుకుంటున్నారు. కాబట్టి మీకు నేనిచ్చే సలహా ఏమిటంటే ఈ కంపెనీ షేర్స్ కొనండనే! అన్నిటికీ నేనున్నాను" అన్నాడు కృపాకర్‌రావు.

"నువ్వేమంటావు" అన్నాడు అర్జున్‌రావు ఊర్మిళతో.

"మామయ్య గారంతగా చెబుతున్నారు గదా... వారి మాట వింటే మంచిదేనని నా అభిప్రాయం... కానీ నేను చెప్పాననే మీరు నిర్ణయం తీసుకోవద్దు. రేపేమన్నా అయితే నన్నంటారు. మీ ఫ్రెండ్స్‌ని కూడా అడిగి మీ ఇష్టమొచ్చినట్లుగా చెయ్యండి" అంది ఊర్మిళ.

ఈ ఆడవాళ్ళతో ఇదే తిప్పలు. యేదీ సరిగ్గా చెప్పరు. చెప్పినట్టే చెప్పి తర్వాత మేం అలా చెప్పలేదంటారు... "మీరంటే నాకు చాలా గౌరవముంది బాబాయ్. మీరన్న ఆ కంపెనీ షేర్స్‌ని నాకు కొనిపెట్టండి. ఎన్ని కొనాలి... వాటిని ఎప్పుడమ్మాలి... అన్నీ మీరే చెప్పాలి" అంటూ అర్జున్‌రావు తనకొచ్చిన యాభైవేల ఎరియర్స్‌ని కృపాకర్‌రావు చేతిలో పెట్టాడు.

ఇది జరిగి ఆరు నెలలు తిరిగేటప్పటికి ప్రపంచమంతటా షేర్‌మార్కెట్లు చాలా ఘోరంగా దెబ్బతిన్నాయన్న వార్తలొచ్చాయి. ఈ వార్తలు వినగానే అర్జున్‌రావులో వణుకు ప్రారంభమైంది. సాయంత్రం కాగానే స్కూలు నుండి వెంటనే కృపాకర్‌రావు దగ్గరకు పరుగెత్తాడు.

"నా చేత కొనిపించిన షేర్ల గతేమయింద"ని అడిగాడు.

"కంగారు పడకురా అర్జున్... నువ్వు కొన్న షేర్లే కాదు... అన్ని కంపెనీల షేర్లు పతనమయ్యాయి. ఇలాంటి పరిణామం ఉత్పన్నమౌతుందని ఎవరమూ ఊహించలేదు. షేరు మార్కెట్లను గూర్చి ఎంతో నాలెడ్జి ఉన్న గొప్ప గొప్ప ఎక్స్‌పర్ట్సే కంగుతి



న్నారు. అయితే పరిస్థితి ఎప్పుడూ ఇలాగే ఉంటుం దనుకోకు. త్వరలోనే పరిస్థితి మారొచ్చు. నువ్వు కొన్న, షేర్ల ధరలు పెరగొచ్చు. కొంతకాలం ఓపిక పడ్తే పరిస్థితి మెరగవొచ్చు'' అన్నాడు కృపాకర్‌రావు.

''అంటే... అంటే... ప్రస్తుతమైతే మునిగామనేగా మీరు చెప్పేది'' అన్నాడు అర్జున్‌రావు.

''మునిగామని ఎందుకనుకుంటున్నావు? కొంతకాలం నువ్వు షేర్లు కొన్న విషయమే మరచిపో. పరిస్థితి మెరుగయ్యాక నేనే నీ షేర్లు అమ్మిపెడ్తా. నీకేం నష్టం లేకుండా చేస్తా'' అన్నాడు కృపాకర్‌రావు.

''ఏం చేస్తారో ఏమిటో! అంతా మా కర్మ'' అంటూ అర్జున్‌రావు తనింటికి వచ్చేశాడు.

''ఊర్మిళా... ఊర్మిళా!'' అంటూ అతనికలవాటైన గావు కేకలు పెట్టాడు.

మళ్ళీ యేదో మూఢిందనుకుంటూ ఊర్మిళ అతనికెదురుపడింది.

''మళ్ళీ ఏమైందండీ! ఆ షేర్ల గొడవేనా! కొంతకాలం ఓపికపడ్తే పరిస్థితి మారుతుందని మామయ్యగారు నాతో చెప్పారు. కొంతకాలం ఓపికపడదాం'' అంది ఊర్మిళ.

''ఏం ఓపిక... అవతల కొంపలంటుకుపోతొంటే ఓపికా.... అందరూ నాకు శనిలా దాపురించారు. వాడేదో గొప్పవాడు, మంచివాడూ అన్నావు. మామయ్యా... మామయ్యా అంటూ వాడిమీద ప్రేమ ఒలకబోశావు. వాడూ, నువ్వూ కలిసి నన్ను సర్వనాశనం చేశారు.. ఛీఛీ! అంతా నీ కారణంగానే. నువ్వు ఈ ఇంటికి శనిలా దాపురించావు. నువ్విక ఒక్క క్షణం నా ఇంట్లో ఉండొద్దు. పో వాడి దగ్గరికే పో... మామయ్య మామయ్య అంటూ వాడిమీద ప్రేమ ఒలకబోశావుగా. వాడిదగ్గరికే పో... ఒక్క క్షణం కూడా ఈ ఇంట్లో ఉండొద్దు. మళ్ళీ ఈ ఇంట్లో అడుగు పెట్టొద్దు. పో... ఇప్పుడే పో'' అంటూ అర్జున్‌రావు పెద్దగా అరిచాడు.

''మీకేమన్నా పిచ్చెక్కిందా? ఎందుకలా అరుస్తున్నారు... అంత పెద్ద మనిషిని పట్టుకొని వాడు వీడు అంటున్నారా? ఆయన వింటే మీ పనేమవుతుందో ఆలోచించారా?'' అంది ఊర్మిళ.

''వాడు, నువ్వూ కలిసి నన్నేమన్నా చేద్దామనుకుంటున్నారా? నువ్వు వెంటనే బయటకెళ్తావా - లేదా?''

''మీకు నిజంగానే పిచ్చెక్కింది. నేనెక్కడకూ వెళ్ళను. ఈ ఇంటిమీద మీకెంత హక్కుందో నాకూ అంతే హక్కుంది. షేర్లు కొనాలని, కోటీశ్వరులం అయిపోవాలని మీకూ ఉండేదని నాకు తెలీదనుకుంటున్నారా? ఎన్నోసార్లు మీరు నాతో షేర్లను రైట్ టైమ్‌లో కొని రైట్‌టైమ్‌లో అమ్మితే బోల్డు లాభాలొస్తాయని చెప్పిన విషయం మరచిపోయారా? షేర్లు ఎప్పుడు కొనాలో ఎప్పుడు అమ్మాలో చెప్పేవాళ్ళు మనకెవరైనా ఉంటే ఎంత బావుండును అని అన్లేదా? కృపాకర్ మామయ్య షేర్ల కన్సల్‌టెన్సీ పెట్టాడని తెలియగానే మనమొకసారి ఆయన దగ్గరకు వెళ్దొద్దామని నన్ను పురమాయించలేదూ! మీ మనసులో షేర్లు కొనాలన్న మోజుందని గమనించే నేనూ మీతో కృపాకర్ మామయ్య దగ్గరకొచ్చాను. అప్పుడాయన షేర్‌మార్కెట్ పరిస్థితిప్పుడు బాగా లేదన్నాడు. షేర్‌మార్కెట్ పరిస్థితి బాగున్నప్పుడు ఆయనే మన దగ్గరకొచ్చాడు. ఆయన మనిద్దరికి కావలసిన వాడు. మన శ్రేయస్సు కోరేవాడు. ఆయన కావాలని మనల్నేం మోసం చెయ్యలేదు. షేర్ల బిజినెస్‌లో కొంత రిస్క్ ఉందని మీకూ తెలుసు. అయినా రిస్క్ తీసుకోకపోతే మనం పైకి వెళ్ళలేమని అనుకునే మీరు షేర్లు కొన్నారు. కృపాకర్ మామయ్య చెప్పాడనో, నేను చెప్పాననో కాదు. ప్రతిదానికి ఇతరులను నిందించే బదులు మన తప్పేమైనా ఉందా అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకుంటే మంచిది. కోపం తగ్గేదాకా కాసిన్ని మంచి నీళ్ళు తాగి పడుకోండి'' అంది ఊర్మిళ.

''అంతా నా కర్మ'' అంటూ ఆమె తెచ్చిచ్చిన మంచి నీళ్ళు తాగేసి పక్కమీదికి ఒరిగిపోయాడు. అతడు విపరీతంగా అలసిపోయినట్లుగా ఫీలయ్యాడు.

''ఏదన్నా ఓ పని చేసినప్పుడు మనం ఆశించిన ఫలితం రాకపోతే అందుకు మనం కారణం కాదని, ఎవరి బలవంతం మీదనో మనమా పనిచేశామని అనుకోవడం మీలాంటి వాళ్ళకు చాలా తృప్తినిస్తుందనుకుంటాను. మనం చేసిన ఓ పని వల్ల ఉత్పన్నమయిన ఫలితాలకు - అవి చెడువి కావచ్చు - మంచివి కావచ్చు - ఏవైనా అందుకు మనమే బాధ్యులం అనుకోవాలి. మంచి జరిగితే అది మన తెలివి అనుకోవడం, చెడు జరిగితే అందుకు మరెవరో బాధ్యులనుకొని వాళ్ళను నిందించటం చాలా తప్పండి. మీరు ప్రశ్నించుకొని మీలోకి మీరు చూసుకుంటే ఇది మీకే అర్థమవుతుంది'' అంది ఊర్మిళ.

''దయచేసి నీ ఉపన్యాసం అవుతావా?'' అన్నాడతడు బెడ్‌మీదున్న దుప్పటి తీసి నిండా కప్పుకుంటూ.

అతడి బుర్రలో చాలాసేపు ఊర్మిళ చెప్పిన మాటలే ప్రతిధ్వనించాయి. ఆమె చెప్పిన మాటల్లో నిజముందనిపించింది. షేర్లు కొని కోటీశ్వరుణ్ణయి పోవాలన్న కోరిక తనలోనూ ఉండేదని ఊర్మిళ అన్నమాట నిజమే. పేకాట ఆడి డబ్బులు సంపాదించాలన్న బలహీనత కూడా తనలో ఉండేది. చిట్టీలు కట్టి, ఒకేసారొచ్చిన డబ్బుతో ఓ మారుతి కారు కొనుక్కొని పక్కన ఊర్మిళను కూర్చోబెట్టుకొని తిరగాలన్న మోజు కూడా తనలో ఉండేది. నిజానికి ఆ నిర్ణయాలన్నీ తనే తీసుకున్నాడు. ఆ నిర్ణయాల వల్ల తను ఆశించిన ఫలితాలు రాకపోయేసరికి ఆ నిర్ణయాలు తనంతట తాను తీసుకోలేదని ఇంకెవరో తనను బలవంతం చేసి ఆ నిర్ణయాలు తీసుకునేలా చేశారని వాళ్ళను నిందించి తృప్తిపడటం అలవరచుకున్నాడు. మన నిర్ణయాల వల్ల ఉత్పన్నమయ్యే ఫలితాలకైనా మనమే బాధ్యులమనీ, వాటిని మనమే ఎదుర్కొని పరిష్కరించుకోవాలనే ప్రాథమిక సూత్రాన్ని తను ఉల్లంఘించి తనను తాను మోసగించుకుంటూ తృప్తి పడ్డాడు. పాపం, ఊర్మిళ చాలా మంచిది. ఆమె తప్పేమీలేదు. తను ఎన్నిమాటలన్నా, ఎంత అవమానించినా భరించి తనలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నించింది. ఊర్మిళ లాంటి సహనశీలి తనకు భార్యగా లభించటం నిజంగా తన అదృష్టం.

రెండు మూడు గంటలసేపు అతని ఆలోచనలు ఇలాగే సాగాయి. రాత్రి 8 గంటలవుతుండగా ఊర్మిళ వచ్చి అతడు నిద్రపోయాడనుకుని ''ఇక లేచి భోజనం చెయ్యండి'' అంది అతన్ని తట్టి లేపుతూ.

అతడు కప్పుకున్న దుప్పటిని తీసేసి ఆమెను తన దగ్గరికి తీసుకుంటూ ''సారీ ఊర్మిళా! ఇకనుండి నా నిర్ణయాల వల్ల తలెత్తే ఫలితాలకు నేనే బాధ్యుణ్ణని అంగీకరిస్తాను. అందుకెవరో బాధ్యులని ఎవర్నీ... ముఖ్యంగా నిన్ను... నిందించను'' అన్నాడు.

''ఇప్పటికైనా మీలో ఈ జ్ఞానోదయం కలిగినందుకు సంతోషిస్తున్నాను'' అంది ఊర్మిళ అతని మీదకు ఒరిగిపోతూ.

*

రచయిత సెల్: 99892 91299

## అంతిమం




నువ్వు
నేను కూడా
నదులం
లోపల బయట
నీ నా
ఆకాశాలకు తెలుసు
మన గమనం
చేరే చోటుకోసం
ఏ దారి దొరుకుతే అటు
ఎక్కడ మొదలైనా
నీ నది నన్ను
నా నది నిన్ను
లేదా వరదై నిన్ను నన్ను
ముంచెత్తినా సరే
ఆపలేని ఆనకట్టలం
సగం కల
సగం మెలకువతో
ఆకాశ నక్షత్రాల్ని చూసుకుంటూ
నేల మీద నీడల్ని లాగుకుంటూ
నీ నా ప్రయాణం
ఒకేసారి లేదా ఒకరి తరువాత ఒకరం
ఎన్నటికైనా చేరేదే గమ్యం
ఎలా చేరుతేనేం
ఎవరు ముందయితేనేం

-ముకుంద రామారావు

సెల్ నెం: 99083 47273